

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## పంచాయతీ కార్మికుల అరెస్టు శోచనీయం

**నారాయణఖేడ్ టౌన్, డిసెంబరు 17, ప్రభాతవార్త:**
న్యాయమైన డిమాండ్ల సాధన కొరకు చలో హైద్రాబాద్ కార్యక్రమానికి వెళుతున్న పంచాయతీ కార్మికులను అరెస్టు చేయడం శోచనీయమని ఎఐటియుసి జిల్లా నాయకులు చిరంజీవి ఖండించారు. పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని, ఈఎస్ఐ, పిఎఫ్ కల్పించాలని, బీమా సౌకర్యం కల్పించాలని చిరంజీవి డిమాండ్ చేశారు. శాసనసభ ఎన్నికల సందర్భంగా కార్మికుల సంక్షేమ కొరకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. కార్మికులపై రాజకీయ నాయకుల వేధింపులు ఆపాలని హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు అశోక్, పెంటయ్య, బాలరాజ్, లక్ష్మయ్య, శంకర్, మొగులయ్య, దుర్గయ్య, నర్సింలు, సాయిలు, లాజర్, సురేష్ పాల్గొన్నారు.

## విశ్రాంత ఉద్యోగులకు ఘన సత్కారం

**నారాయణఖేడ్, డిసెంబరు 17, ప్రభాతవార్త:**
నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలో గల విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో అఖిల భారత విశ్రాంత ఉద్యోగుల సమావేశం ఏర్పాటు చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సంగారెడ్డి జిల్లా రీజినల్ చీఫ్ మేనేజర్ నాగేశ్వర్‌రెడ్డి, నారాయణఖేడ్ ఎస్.బి.ఐ. చీఫ్ మేనేజర్ మురళీకృష్ణలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా విశ్రాంత ఉద్యోగుల నారాయణఖేడ్ నియోజకవర్గ అధ్యక్షులు బి.నర్సింలు మాట్లాడుతూ నూతనంగా ఐదుగురు విశ్రాంత ఉద్యోగులకు సభ్యత్వం ఇచ్చామన్నారు. 14మంది పెన్షన్‌దారులకు మొమెంటోలు అందజేసి పూలమాల శాలువలతో ఘనంగా సన్మానించారు. కాగా మిగతా విశ్రాంత ఉద్యోగులను కూడా శాలువతో సన్మానించారు. అనంతరం భవనంలో విశ్రాంత ఉద్యోగుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల కిష్టయ్యమాస్టర్, వీరయ్య వార్డెన్, వెంకటేశం టీచర్, విశ్రాంత ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

### అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు సర్వేప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి-జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్



ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో పాల్గొని గుడిసెను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

**సంగారెడ్డి బ్యూరో, డిసెంబరు 17, ప్రభాతవార్త:**
అర్హులైన లబ్దిదారులకు ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు సర్వేప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని జిల్లాకలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. మంగళవారం మెదక్ మున్సిపాలిటీలోని దాయరవీధిలో ఇందిరమ్మ ఇళ్లసర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారుల క్షేత్రస్థాయి స్థితిగతులపై ఇందిరమ్మ ఇళ్ల యాప్ వినియోగిస్తూ చేస్తున్న సర్వేప్రక్రియను కలెక్టర్ రాహుల్‌రాజ్ క్షుణ్ణంగా పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దరఖాస్తుదారులు సంబంధితపత్రాలను ముందస్తుగా అందుబాటులో పెట్టుకొని సర్వే వేగవంతం అయ్యేందుకు సహకరించాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి తప్పిదాలకు తావులేకుండా వివరాలను సేకరించి ఇందిరమ్మ యాప్‌లో లాగిన్ అయ్యి వివరాలను పక్కాగా నమోదు చేయాలన్నారు. సర్వేకోసం భూమి యాజమాన్యపత్రం అత్యంత ముఖ్యమైన దని, సొంత ఇంటికి స్థలం ఉందా, ఉంటే దానికి సంబంధించిన ధృవ పత్రాలు, అవి లేనిపక్షంలో ఇంటి పన్ను రసీదులు, తెల్ల రేషన్‌కార్డ్ తదితర పత్రాలను పరిశీలించాలన్నారు. లబ్దిదారుడితో పాటు ఇంటి పైకప్పు, స్థలానికి సంబంధించిన చిత్రాలను యాప్‌లో సక్రమంగా అప్‌లోడ్ చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లసర్వేపై ప్రజలకు అవగాహన కల్పించాలని, సర్వే జరిగే సమయంలో ప్రజలు అందుబాటులో ఉండేవిధంగా షెడ్యూల్ గురించి ముందుగానే సమాచారం అందించాలన్నారు. ఈకార్యక్రమంలో కలెక్టర్ వెంట తాహసీల్దార్ లక్ష్మణ్ బాబు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**కొల్చారం, డిసెంబరు 17, ప్రభాతవార్త:**
మంగళవారం కొల్చారం మండలపరిధిలోని పోతంశెట్టిపల్లి గ్రామంలో ఎంపిడివో కృష్ణవేణితో కలిసి క్షేత్రస్థాయిలో ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు చేపట్టిన సర్వేను పరిశీలించారు. ఇందులో భాగంగా మొదటివిడతలో ప్రతి నియోజకవర్గానికి 3500 చొప్పున ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి పూనుకుందన్నారు. అర్హులైన నిరుపేదలకు ఇల్లు ఇవ్వడమే రాష్ట్రప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. స్థలం కలిగి ఉన్నవారికి మొదటిప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కొల్చారం ఎంపీడీవో కృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శి అరుంధతి, ఏపీవో మహిపాల్ రెడ్డి, సర్వే అధికారులు, ఆయ శాఖల అధికారులు ఉన్నారు.

## క్రీడలు శారీరక ఆరోగ్యాన్ని కలుగజేస్తాయి



క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్, జిల్లా అదనపు కలెక్టర్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
క్రీడలు శారీరక ఆరోగ్యాన్ని అందించడంతో పాటు మానసిక చురుకుదనం కలుగజేస్తాయని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. జిల్లాకేంద్రంలోని డిగ్రీకళాశాల మైదానంలో క్రీడాశాఖ ఆధ్వర్యంలో రెండురోజుల పాటు నిర్వహించతలపెట్టిన జిల్లాస్థాయి సిఎం కప్ 2024క్రీడాపోటీలు, రాష్ట్రస్థాయి పోటీల ఎంపికను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములను పక్కనపెట్టి క్రీడాస్ఫూర్తితో పాల్గొనాలన్నారు. గ్రామీణప్రాంత క్రీడాకారుల్లో ఉన్న నైపుణ్యాలను వెలికితీయడానికి సిఎంకప్ క్రీడలను నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. జిల్లా అదనపుకలెక్టర్ అబ్దుల్ హమీద్ మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు కూడా చాలా ముఖ్యమన్నారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి జయదేవ్ ఆర్య తదితరులు మాట్లాడారు. ఖో-ఖో, కబడ్డీ, వాలీబాల్ క్రీడలతో పాటు ఫుట్‌బాల్, హ్యాండ్ బాల్, బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్, స్విమ్మింగ్, యోగా, బాక్సింగ్, జూడో, చెస్, కిక్‌బాక్సింగ్, తదితర క్రీడలను నిర్వహిస్తున్నారు. జిల్లాస్థాయిలో ఎంపికైన క్రీడాకారులను రాష్ట్రస్థాయికి పంపుతారు. కార్యక్రమంలో వివిధశాఖల అధికారులు, పిఈటిలు, ఉపాధ్యాయులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లులేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు

-కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కన్నాయాదవ్

**గజ్వేల్, డిసెంబరు 17, ప్రభాతవార్త:** బడుగు, బలహీనవర్గాల సంక్షేమం కోసమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొనమైన కన్నాయాదవ్ పేర్కొన్నారు. మంగళవారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్‌లోని 3వ వార్డులో ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సర్వేను పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇల్లులేని నిరుపేదలు దరఖాస్తు చేసుకున్నవారికి ప్రభుత్వం రూ.5లక్షల ఆర్థికసహాయం అందిస్తుందన్నారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారు ఇంటింటి సర్వేకు వస్తున్న అధికారులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు కొనమైన పావని, మున్సిపల్ సిబ్బంది మల్లేశం, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదు



మాట్లాడుతున్న ఏఎంసి వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్

**గజ్వేల్ టౌన్, డిసెంబరు 17, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ సర్దార్‌ఖాన్ పేర్కొన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 6,7,12 వార్డుల్లో ఇందిరమ్మ కమిటీసభ్యులతో కలిసి సర్వే జరుగుతున్న తీరును మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా సర్దార్‌ఖాన్ మాట్లాడుతూ కాంగ్రెస్‌ప్రభుత్వం ఆరుగ్యారంటీలలో భాగంగా ఇందిరమ్మ గృహనిర్మాణం కోసం రూ.5లక్షలు ఇవ్వడానికి క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు గంగిశెట్టి రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, గాడిపల్లి శ్రీనివాస్, నేత నాగరాజు, అజ్గర్, శేఖర్, శ్రీను, సురేష్, అరుణ్, కృష్ణ, చంద్రం తదితరులు పాల్గొన్నారు.

## సమ్మెకు ఉపాధ్యాయ సంఘాల సంఘీభావం



నిరవధిక సమ్మెకు ఉపాధ్యాయులు మద్దతు తెలుపుతున్న దృశ్యం

**టేక్మాల్, డిసెంబరు 17, ప్రభాతవార్త:** సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు నిరవధిక సమ్మె కార్యక్రమానికి పిఆర్టియు టేక్మాల్ మండలశాఖ సంఘీభావం తెలియజేశారు. వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని 20 సంవత్సరాలుగా సమగ్రశిక్షలో పనిచేసినప్పటికీ 20,000జీతం కూడా తీసుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. నిత్యావసర వస్తువులు పెరుగుతున్న క్రమంలో వారిజీవనం కొనసాగించడం చాలా కష్టతరమని, వారు వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని మనస్ఫూర్తిగా కోరారు. రాష్ట్రనాయకత్వం జిల్లానాయకత్వం మండలనాయకత్వం అందరూ వారిసమస్యలకు పూర్తిమద్దతు తెలియజేయడం జరుగుతుంది. ప్రభుత్వం నుంచి సానుకూల నిర్ణయం రావాలని టేక్మాల్ మండలశాఖ ఆశించారు. కార్యక్రమంలో జిల్లా పిఆర్‌టియు గౌరవ అధ్యక్షులు దుర్గయ్య, అమీరుద్దీన్, సహదేవ్, రమేష్, సాజిద్ పాషా, నరేష్ పాలొన్నారు.

## కంది ఓడిఎఫ్‌లో ప్రారంభమైన క్రీడలు

**కంది, డిసెంబరు 17, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని ఓడిఎఫ్‌లో క్రీడాపోటీలను మంగళవారం చీఫ్ జనరల్ మేనేజర్ ప్రసాద్ జ్యోతి ప్రజ్వలనచేసి ప్రారంభించారు. చీఫ్ జనరల్ మేనేజర్ ప్రసాద్ మాట్లాడుతూ ఈనెల 21వ తారీఖు వరకు ఉద్యోగులకు బాస్కెట్‌బాల్, వాలీబాల్, క్రికెట్‌పోటీలను నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. క్రీడాకారులు క్రీడలను క్రీడానైపుణ్యంతో ఆడుకోవాలని సూచించారు.

# ప్రతిభావంతులైన క్రీడాకారులకు మెదక్ జిల్లా నెలవు

-జిల్లా పేరును క్రీడలలో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలపాలి



సిఎం కప్ క్రీడలను జ్యోతివెలిగించి ప్రారంభిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్, చిత్రంలో ఎస్పీ ఉదయ్ కుమార్

**సంగారెడ్డి బ్యూరో, డిసెంబరు 17, ప్రభాతవార్త:**
గ్రామీణస్థాయి నుండి యువక్రీడాకారుల ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించడమే లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం సిఎం కప్ పోటీలు నిర్వహిస్తుందని జిల్లాకలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. మంగళవారం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల క్రీడాప్రాంగణంలో సిఎం కప్ జిల్లాస్థాయి క్రీడాపోటీల కార్యక్రమంలో జిల్లాకలెక్టర్ రాహుల్‌రాజ్ ఎస్పీ ఉదయకుమార్, జిల్లాక్రీడల నిర్వహణాధికారి నాగరాజు, డిఎఫ్‌వో జోజి, తహసీల్దార్ లక్ష్మణ్ బాబు, డిపిఆర్‌వో రామచంద్రరాజులతో కలిసి క్రీడోత్సవాలకు సంబంధించిన క్రీడా జ్యోతిని వెలిగించి క్రీడాపోటీలను ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహించడానికి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వారు సిఎం కప్ గురించి చైతన్యం కల్పించి పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుండి ఎక్కువ క్రీడాకారులు పాల్గొనేవిధంగా అవగాహన కల్పించామని, మనజిల్లా నుండి, రాష్ట్రస్థాయి నుండి ప్రపంచస్థాయిలో రాణించేవిధంగా క్రీడాకారులు తయారుకావాలని, ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకుని క్రీడల్లో మనజిల్లాకు పేరుప్రఖ్యాతులు తీసుకురావాలని సూచించారు. గ్రామీణ, మండలస్థాయి నుండి యువత పెద్ద ఎత్తున సిఎం కప్ క్రీడలలో పాల్గొని విజయవంతంగా జిల్లా స్థాయికి చేరుకోవడం జరిగిందని అన్నారు.
ప్రభుత్వం విద్య, వైద్యంతో పాటు క్రీడలకు అత్యంతప్రాధాన్యత ఇస్తుందని, క్రీడాకారులను ప్రోత్సహిస్తూ క్రీడాపాఠశాలలు, క్రీడాయూనివర్సిటీ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. కవులు, కళాకారులతో పాటు క్రీడాకారులకు కూడా సముచితస్థానం కల్పించడం శుభపరిణామంగా పేర్కొన్నారు. తెలంగాణ స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వలక్ష్యాలకు అనుగుణంగా ప్రతిభావంతులైన క్రీడాకారులుగా తయారుకావాలని ఆకాంక్షించారు. జిల్లాస్థాయిలో క్రీడలలో ఉత్తమప్రతిభ కనబరిచిన వారికి రాష్ట్రస్థాయిలో క్రీడాపోటీల్లో పాల్గొనే అవకాశం వస్తుందని, మెదక్ జిల్లా పేరును క్రీడలలో ప్రథమస్థానంలో నిలపాలని ఆకాంక్షించారు. జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ మాట్లాడుతూ ఓటమి, గెలుపుకు నాంది పలుకుతుందని, క్రీడాకారులు ఓడిపోయామని నిరుత్సాహపడకుండా క్రీడలలో పాల్గొన్నందుకు ప్రతిభకు పరీక్షగా భావించాలని, క్రీడలు శారీరక, మానసిక దృఢత్వానికి ఎంతో దోహదపడతాయని అన్నారు. దైనందిక జీవితంలో వ్యాయామంపై శ్రద్ధవహించి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మించే దిశగా కృషిచేయాలన్నారు. ప్రతిభావంతులైన క్రీడాకారులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాస్థాయి క్రీడాపోటీలకు వాలీబాల్ క్రీడలలో పురుషులవిభాగంలో 25టీమ్‌లు, మహిళలవిభాగంలో 14టీమ్‌లు, కబడ్డీ క్రీడలో పురుషుల విభాగంలో 25టీమ్‌లు, మహిళలవిభాగంలో 24టీమ్‌లు పోటీల్లో పాల్గొంటున్నాయని కలెక్టర్ వివరించారు. క్రీడలలో పాల్గొనే వారందరికీ భోజనసదుపాయం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతరం వాలీబాల్ క్రీడను జిల్లాకలెక్టర్, ఎస్పీలు ప్రారంభించారు. కార్యక్రమంలో పిడిల సంఘం సెక్రెటరీ శ్రీనివాసరావు, పిడిలు శ్రీధర్‌రెడ్డి, మాధవరెడ్డి, రమేష్, రాజేందర్, సంబంధిత వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## సిఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డికి శ్రీమల్లికార్జునస్వామి కళ్యాణ ఆహ్వానపత్రిక అందజేత



మల్లికార్జున స్వామి కళ్యాణ ఆహ్వాన పత్రికను అందజేస్తున్న దృశ్యం

**కొమురవెల్లి, డిసెంబరు 17, ప్రభాతవార్త:**
మండల కేంద్రంలోని శ్రీ కొమురవెల్లిలో ఈనెల 29న నిర్వహించనున్న శ్రీమల్లికార్జునస్వామి కళ్యాణానికి రావాలని కోరుతూ మంగళవారం సిఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డికి ఆలయ అధికారులు, అర్చకులు ఆహ్వానపత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో జనగామ డిసిసి అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, ఆలయ ఈవో బాలాజీ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహాదేవుని మల్లికార్జున్, ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్, అర్చకులు అంజనేయులు, పడిగన్నగారి మల్లేశం ఉన్నారు.

## ఘనంగా అయ్యప్పస్వామి మహాపడిపూజ



అయ్యప్పస్వామి పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పద్మ

**రామాయంపేట, డిసెంబరు 17, ప్రభాతవార్త:** రామాయంపేట మండలకేంద్రంలోని హరిహరసుత అయ్యప్పస్వామి దేవాలయంలో మహాపడిపూజ కార్యక్రమం మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. 41రోజుల పాటు దీక్ష తీసుకున్న కాట్రియాల గ్రామ బిఆర్ఎస్ నాయకుడు రాజేందర్‌గుప్తా ఆధ్వర్యంలో అయ్యప్ప మహాపడిపూజ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక మున్సిపల్ చైర్మన్, అయ్యప్ప దేవాలయకమిటీ వ్యవస్థాపకులు పల్లె జితేందర్‌గౌడ్ చేతులమీదుగా ఈ అయ్యప్పస్వామి మహాపడిపూజ కార్యక్రమం నిర్వహించారు. అయ్యప్పస్వామి మహాపూజ కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, నియోజకవర్గ ఇంచార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, టిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గజవాడ నాగరాజు పాల్గొని స్వామివారికి విశేష పూజాకార్యక్రమాలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు, పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు, అధికారులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## అల్ప్రోజోలం స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు



అల్ప్రోజోలం స్వాధీనం చేసుకుని వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ అధికారులు

**సిద్ధిపేట రూరల్, డిసెంబరు 17, ప్రభావార్త:** సిద్ధిపేట ఎక్సైజ్ పోలీసులు రెండురోజుల వ్యవధిలో రూ.40లక్షల విలువచేసే అల్ప్రోజోలం స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ ఎస్‌హెచ్ఓ శ్రీనివాస్, టిటిఎఫ్ సిఐ శ్రీధర్‌లు మంగళవారం అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్ధిపేట నుంచి కిష్టాసాగర్‌కు ప్రమాదకరమైన అల్ప్రోజోలం తీసుకెళ్తున్నట్లు వచ్చిన నమ్మదగిన సమాచారం మేరకు ఈనెల 13న దాడిచేసి 2.50కిలోలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అల్ప్రోజోలం తీసుకెళ్తున్న నిందితుడు గడ్డమీది రాజుగౌడ్‌ను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. అల్ప్రోజోలం విలువ రూ.25లక్షలు ఉంటుందని వివరించారు. అలాగే జిల్లాకేంద్రంలోని కాకతీయకాలనీలో మరుపల్లి అర్జున్ ఇంట్లో రూ.15లక్షల విలువచేసే 1.50కిలోల అల్ప్రోజోలం సోమవారం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అల్ప్రోజోలంను పట్టుకున్న ఎక్సైజ్ అధికారులు, సిబ్బందిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసన్‌రెడ్డి, మెదక్ డిప్యూటీ కమిషనర్ జె.హరికృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డిలు అభినందించారు.

## నేడు పంచగామలో సెమి క్రిస్మస్ వేడుకలు

**నారాయణఖేడ్, డిసెంబరు 17, ప్రభాతవార్త:**
క్రిస్మస్‌పండుగను పురస్కరించుకుని నారాయణఖేడ్ మండలపరిధిలోని పంచగామ గ్రామశివారులో గల క్రీస్తు ఆరాధనమందిరంలో సెమి క్రిస్మస్‌వేడుకల కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఫాస్టర్ బాలయ్య తెలిపారు. మంగళవారం ఆయనమందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ నేడు బుధవారం సాయంత్రం 6గంటల నుంచి సెమి క్రిస్మస్‌వేడుకలు, ఆరాధనకార్యక్రమం నిర్వహించడం జరుగుతుం దన్నారు. కార్యక్రమానికి దైవజనులు హైదరాబాద్ నుంచి రానున్నట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గంలోని ఫాస్టర్లు, ఆయాగ్రామాల క్రైస్తవసోదరులు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి సెమి క్రిస్మస్‌వేడుక కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని ఆయన కోరారు.

## దమ్ము చక్రాల ట్రాక్టర్లతో రోడ్లు ధ్వంసం



ఇష్టారీతిన రోడ్లపై పరుగులు పెడుతున్న కేజివీల్స్ ట్రాక్టర్లు

**చిన్నశంకరంపేట, డిసెంబరు 17, ప్రభాతవార్త:**
అదనపు శ్రమ,ఖర్చు తగ్గుతుందన్న కొందరుట్రాక్టర్ల యజమానులస్వార్థానికి లక్షలాది రూపాయల విలువైన రహదారులు ధ్వంసమవుతున్నాయి. ఎవరూ పట్టించుకోవడం లేదన్న ధీమాతో ఇష్టారీతిన రోడ్లపై కేజ్‌వీల్స్‌తో ట్రాక్టర్లను పరుగులుపెట్టిస్తుండటంతో రహదారులు దారుణంగా దెబ్బతింటున్నాయి. వ్యవసాయ సీజన్‌లో వరినాట్లకు ముందు దుక్కిదున్నుతారు. ఇందుకోసం ట్రాక్టర్లచక్రాలు తీసివేసి కేజ్‌వీల్స్ (దమ్ము చక్రాలు) బిగించి దున్నుతారు. ఈచక్రాలను పొలంలో బిగించుకొని దున్నడం పూర్తయ్యాక విప్పివేసి టైర్లు బిగించిన తర్వాతే రోడ్లపైకి రావాలి. అయితే ట్రాక్టర్ల యజమానులు ఈకాస్త శ్రమ ఎందుకన్న భావంతో ఇంటివద్దనే కేజ్‌వీల్స్ బిగించుకుని పొలాలకు వెళుతున్నారు. దీంతో ఇనుపచక్రాల ధాటికి తారురోడ్లపై గీతలుపడి రోడ్లు ధ్వంసం అవుతున్నాయి. ప్రధానంగా చిన్నశంకరంపేట, ఖాజాపూర్, ఖాజాపూర్‌తండా, కొండాపూర్, గజగట్లపల్లి జంగరాయి, గవ్వలపల్లి రహదారులలో కేజ్‌వీల్స్‌తో ట్రాక్టర్లు నడపడంతో రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఈకేజ్‌వీల్స్‌తో ట్రాక్టరు ఒక్కసారి ప్రయాణిస్తే పదేళ్లు ఉండాల్సిన రహదారి రెండేళ్లకే దెబ్బతినిపోతుందని, ఈ రోడ్లపై ప్రయాణించలేకపోతున్నామని వాహనదారులు, ప్రజలు అంటున్నారు. వ్యవసాయ సీజన్‌లో వందలాది ట్రాక్టర్లు దమ్ముచక్రాలతో ఈరహదారుల్లో ప్రయాణిస్తున్నాయి. పట్టించుకోవాల్సిన రవాణాశాఖ, రహదారులశాఖ, పోలీసులు ఈవాహనాల వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. లక్షలాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన రహదారులు దెబ్బ తిని ప్రయాణానికి పనికిరాకుండా పోతున్నాయి. మరమ్మతులు చేసినా మళ్లీ యథాపరిస్థితే. వాహనచట్టాల నియమాల మేరకు అసలు రహ దారుల పైకి దమ్ముచక్రాలతో రావడానికి అవకాశమే లేదు. ఆర్‌అండ్‌బి అధికారులు, పోలీసులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## పంచాయతీ కార్మికుల అరెస్టు



పంచాయతీ కార్మికులను పోలీసులు అరెస్టు చేస్తున్న దృశ్యం

**సిర్గాపూర్, డిసెంబరు 17, ప్రభాతవార్త:**
బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ముట్టడికి బయలెక్కిన పంచాయతీ కార్మికులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీసు ఠాణాకు తరలించారు. ఈసందర్భంగా సిఐటియు నాయకులు సతీష్ మాట్లాడుతూ 4 నెలల బకాయి వేతనాలను వెంటనే చెల్లించి, కార్మికులను రెగ్యూలరైజ్ చేయాలని, ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

## క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



క్రీడాకారులతో సెంట్రల్ యూనియన్ అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం.ముజీబ్‌హుస్సే నీలు

**అఫ్జల్‌గంజ్, డిసెంబరు 17(ప్రభాతవార్త):** తెలంగాణ నాన్ గజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఎస్.విక్రమ్ కుమార్ ఆధ్వర్యంలో 11వ బి.స్వామినాథన్ క్రికెట్ టోర్నమెంట్ 2025 పోటిలను తెలంగాణ కేంద్ర కమిటి అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్‌హుస్సే నీలు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాద్ జిల్లా టిఎన్‌జిఓ ఉద్యోగులందరికి కలిసి క్రీడా పోటిలను నిర్వహించడం పట్ల సంతోషదాయకమన్నారు. క్రీడలు కూడా మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయన్నారు. ఈసమావేశంలో గవర్నమెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల అధ్యక్షులు డాక్టర్ కె.రామిరెడ్డి, లెక్చరర్ విద్యాసాగర్, కేంద్రసంఘం అసోసియేట్ అధ్యక్షులు సత్యనారాయణగౌడ్, సభ్యులు కొండల్‌రెడ్డి, జిల్లా కార్యానిర్వాహక అధ్యక్షులు కె.ఆర్.రాజ్‌కుమార్, గడ్డం జ్ఞానేశ్వర్, ఉమర్‌ఖాన్, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సబ్‌స్టేషన్ ముందు డాలర్‌మెడోస్ వాసుల ఆందోళన



ఆందోళన చేస్తున్న డాలర్‌మెడోస్ వాసులు

**దుండిగల్, డిసెంబరు 17 ప్రభాతవార్త:** దుండిగల్ పురపాలిక సంఘం పరిధి భౌరంపేటలోని డాలర్‌మెడోస్‌కు వెళ్ళే దారిలో విద్యుత్‌శాఖ అధికారులు ఇటీవల రోడ్డుకు అడ్డంగా జెసిబితో తవ్వకాలు చేపట్టడంతో అధికారుల తీరుకు నిరసనగా కాలనీవాసులు మంగళవారం సబ్‌స్టేషన్ ఏదుట ఆందోళనకు దిగారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత 17సంవత్సరాల క్రితం గ్రామ పంచాయతీలో తీర్మానం చేసి రోడ్డును కేటాయించారన్నారు. గేటెడ్ కమ్యూనిటీ రూపంలో 257 విల్లాలు నిర్మించడంతో తాము కొనుగోలు చేసి నివాసం ఉంటున్నామని, కాలనీకి ప్రభుత్వం వేసిన రోడ్డును విద్యుత్‌శాఖ అధికారులు ధ్వంసం చేయడం సరికాదన్నారు. కాలనీ పక్కన ఉన్న ప్రభుత్వ భూమిని 2016లో విద్యుత్‌శాఖకు కేటాయించగా సదరు స్థలంలో మధ్యలో నుండి రోడ్డు ఉండడంతో విద్యుత్‌శాఖ, కాలనీవాసులు మధ్య రోడ్డుపై ఒప్పందం చేస్తున్నట్లు తెలిపారు. కాలనీలోకి వెళ్ళే రహదారిని తమ ఆధీనంలో తీసుకోవడానికి ముందు తమకు ప్రత్యామ్నయంగా రోడ్డును చూపాలన్నారు. 2017లో కోర్టును ఆశ్రయించామని, విచారణలో ఉండగా విద్యుత్‌శాఖ అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ రోడ్డును ఆక్రమించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్, రెవిన్యూ, పురపాలిక కమీషనర్‌కు ఫిర్యాదులు చేసిన పట్టించుకోవడం లేదని, తమ కాలనీకి ప్రత్యామ్నయంగా రోడ్డును చూపి సమస్యను పరిష్కరించేవరకు ఆందోళన కొనసాగిస్తామని పేర్కొన్నారు.

## పవన్ ఆశయాల కోసం పనిచేస్తా

### న-సినీ దర్శకుడు వారణాసి సూర్యా

**హైదరాబాద్, డిసెంబరు 17, ప్రభాతవార్త:**
ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆశాల కోసం తాను జీవితాంతం పనిచేస్తానని సినీ దర్శకుడు వారణాసి సూర్య అన్నారు. ఈమేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు న్యాయం చేయడమే లక్ష్యంగా జనసేన పార్టీని ఏర్పాటు చేసి ఎన్ని ఎదురు దెబ్బలు ఎదురైనా పోరాడి నిలిచిన మహా నాయకుడు పవన్ కళ్యాణ్ అని కొనియాడారు. నిస్వార్థ సేవకు నిలువెత్తు నిదర్శనం పవన్ కళ్యాణ్ అని అన్నారు. అలాంటి నాయకుడికి మద్దతు పలకడమే లక్ష్యంగా 100 రుపీస్ ఎమ్మెల్యే అనే కాన్సెప్ట్ ప్రజల ముందుకు వెళుతున్నట్లు చెప్పారు. ఇటీవల కొందరు పవన్ పై ఆరోపణ చేస్తుంటే సహించలేకపోతున్నట్లు చెప్పారు. జనసేనను ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తారని భవిష్యత్తులో జనసేన అవకాశం ఇస్తే ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని లేనిపక్షంలో స్వతంత్రంగా పోటీ చేసి పవన్ కు అండగా నిలుస్తానని పేర్కొన్నారు.

## దిల్‌రాజ్‌ను కలిసిన సెన్సార్‌బోర్డు మెంబర్ సుధాకర్

**హైదరాబాద్, డిసెంబరు 17, ప్రభాతవార్త:**
తెలంగాణ ప్రభుత్వం స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజును ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గా నియమించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం సెంట్రల్ సెన్సార్ బోర్డు మెంబర్ సుధాకర్ దిల్‌రాజ్‌ను ఆయన ఛాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిపారు. ఈ సందర్భంగా సినీ పరిశ్రమ గురించిన పలు అంశాలను చర్చించారు. సినీ పరిశ్రమ గురించి పూర్తి అవగాహన కలిగిన దిల్ రాజును ఎఫ్‌డీసి చైర్మన్‌గా నియమించినందుకు తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## సాంకేతిక పురోగతితో దేశ రక్షణకు శ్రమించండి

### -గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ



జిఓసి ఇన్‌చీఫ్ ట్రోఫీని అందుకుంటున్న లెఫ్టినెంట్ ముదిత్ గుప్త

**అల్వాల్, డిసెంబరు 17 ప్రభాతవార్త:** సాంకేతికతకు అధిక ప్రాధాన్యత ఇస్తూ దేశ రక్షణకు నిబద్ధతతో పని చేయాలని యువ సైనికాధికారులను రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ కోరారు. మంగళవారం తిరిమిలగిరి ఎంసిఇఎంఇ కళాశాలలో జరిగిన 105వ డిగ్రీ ఇంజనీరింగ్ కోర్సు, 42వ టెక్నికల్ ఎంట్రీ కోర్సు స్నాతకోత్సవానికి గవర్నర్ ముఖ్య అతిధిగా విచ్చేశారు. ఇంజనీరింగ్ కోర్సు పూర్తి చేసిన 49 మంది అధికారులకు ఆయన పట్టాలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచీకరణ నేపథ్యంలో సాంకేతికత అనే అస్త్రం నేడు ప్రధాన భూమిక పోషిస్తోందని తెలిపారు. ఇంజనీరింగ్ కోర్సులో సాధించిన మేదో సంపత్తి జ్ఞానాన్ని ఆవిష్కరణలు కోసం వెచ్చించాలని కోరారు. సాయుధ సంపత్తిని సర్వత్రా యుద్ధ తంత్రానికి సిద్ధంగా ఉంచే బాధ్యత ఇంజనీర్లపై ఉంటుందన్నారు. టిఇఎస్ కోర్సులో ఉత్తముడిగా నిలిచిన లెఫ్టినెంట్ ముదిత్ గుప్త జిఓసి ఇన్ చీఫ్ ట్రోఫీని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంసిఇఎంఇ కమాండెంట్ లెఫ్టినెంట్ జనరల్ నీరజ్ వర్షనే ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ రోజాదేవి



అంబేద్కర్‌కు వినతిపత్రం అందజేస్తున్న 126 డివిజన్ జగద్గిరిగుట్ట బిఆర్ఎస్ శ్రేణులు



రాష్ట్ర ప్రభుత్వానికి సద్బుద్ధిని ప్రసాదించాలని అంబేదర్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న బండ్లగూడ కార్పోరేషన్ బిఆర్ఎస్ నేతలు.



తుకారాంగేట్‌లో అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న కార్పోరేటర్ లింగాని ప్రసన్న శ్రీనివాస్ తదితరులు

## లగచర్ల రైతులను వెంటనే విడుదల చేయాలి : బిఆర్ఎస్

**వివేకానంద నగర్ డివిజన్‌లో...**
**కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 17, ప్రభాతవార్త :** లగచర్ల రైతులను వెంటనే విడుదల చేయాలని వివేకానంద నగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజా దేవి అన్నారు. బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు కూకట్ పల్లి శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు సూచనల మేరకు లగచర్ల రైతులపై జరిగిన దాడికి అరెస్టుకు నిరసనగా శేర్లింగంపల్లి నియోజకవర్గం వివేకానంద నగర్ డివిజన్ లోని రిక్షా పుల్లర్స్ కాలనీలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి స్థానిక నాయకులతో కలిసి ఆమె వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాచర్ల భద్రయ్య, వేముల ఆంజనేయులు, జగదీష్ గౌడ్, యశ్వంత్, ప్రవీణ్, పర్వతాల సతీష్ కుమార్, కిరణ్, సత్యనారాయణ, లక్ష్మణ్, బాబు తదితరులు పాల్గొన్నారు.

**ప్రగతి నగర్‌లో...**
**జీడిమెట్ల, డిసెంబర్ 17, ప్రభాతవార్త :** రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు, ఎమ్మెల్యే కేపీ వివేకానంద, ఎమ్మెల్సీ శంభిపూర్ రాజు ఆదేశాలతో రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలలో భాగంగా మంగళవారం నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రగతి నగర్ అంబేద్కర్ సర్కిల్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి నిజాంపేట్ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, ఎన్ఎంసి బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, కార్పొరేటర్లు గాజుల సుజాత, బాలాజీ నాయక్, బొర్రా దేవి చందు ముదిరాజ్, కో ఆప్షన్ సభ్యులు చంద్రగిరి జ్యోతి సతీష్, బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, లగచర్ల రైతుల గోసలు వినతిపత్రం రూపంలో సమర్పించి నిరసన తెలియచేసారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, మహిళా అధ్యక్షులు, యువజన విభాగ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, సోషల్ మీడియా వారియర్స్, ఉద్యమకారులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

**జగద్గిరిగుట్టలో..**
**కొంపల్లి, డిసెంబర్ 17, ప్రభాతవార్త :** 126 డివిజన్ జగద్గిరిగుట్ట కుత్బుల్లాపూర్ భారత రాజ్యాంగంపై ప్రమాణం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అడుగడుగునా రాజ్యాంగాన్ని కాలరాస్తోందని బీఆర్ఎస్ నాయకులు వాపోయారు. ప్రభుత్వానికి జ్ఞానోదయం కలిగించాలని రాజ్యాంగ నిర్మాత అయిన అంబేద్కర్‌కు 126 డివిజన్ జగద్గిరిగుట్ట బిఆర్ఎస్ శ్రేణులు విజ్ఞప్తి చేశారు.

**దుండిగల్ పురపాలిక పరిధిలో**
**దుండిగల్, డిసెంబర్ 17 ప్రభాతవార్త:** రాష్ట్రంలో రైతన్నలపై జరుగుతున్న అరాచకాలు, అణిచివేతలతో పాటు లగచర్ల రైతన్నలను కాపాడాలని కోరుతూ బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు దుండిగల్ పురపాలిక పరిధిలోని ఆయా ప్రాంతాల్లో గల డా.బిఆర్.అంబేద్కర్ విగ్రహాలకు వినతి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ పద్మారావు, కౌన్సిలర్లు సత్యనారాయణ, మహేందర్‌యాదవ్, సాయియాదవ్, ఆనంద్‌కుమార్, నాయకులు, దళిత, గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**బండ్లగూడ కార్పోరేషన్‌లో...**
**నార్సింగి, డిసెంబర్ 17 ప్రభాతవార్త :** అధికార మదంతో అంధులై... అన్నం పెట్టే రైతన్నలకు బేడీలు వేసి జైళ్లకు పంపిన రాష్ట్ర ప్రభుత్వ పెద్దలకు సద్బుద్ధిని ప్రసాదించాలని కోరుతూ అంబేద్కర్ విగ్రహానికి మంగళవారం బండ్లగూడ కార్పోరేషన్ బిఆర్ఎస్ నాయకులు వినతిపత్రంను అందజేశారు. ఈ సందర్భంగా కార్పోరేషన్ బిఆర్ఎస్ అధ్యక్షులు రావులకోళ్ల నాగరాజు మాట్లాడుతూ లగచర్ల గ్రామ రైతులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్ రవీందర్‌రెడ్డి, నాయకులు రాముడు యాదవ్, చంద్రారావ్, వెంకటేష్, పెంటయ్య యాదవ్, ఇస్మాయిల్, కీర్తికాంత్, మహేష్, మల్లేశ్వరి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

**అడ్డగుట్ట డివిజన్‌లో..**
**అడ్డగుట్ట, డిసెంబర్ 17 ప్రభాతవార్త:** లగచర్ల రైతులపై అక్రమ కేసులు బణాయించి జైల్‌లో నిర్భందించడం హేయమైన చర్య అని అడ్డగుట్ట డివిజన్ కార్పోరేటర్ లింగాని ప్రసన్న శ్రీనివాస్ తెలిపారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ ఆదేశాల మేరకు మంగళవారం తుకారాంగేట్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. లగచర్ల రైతులపై పెట్టిన కేసులను ఎత్తి వేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నియంత పాలనగా ఉందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు నక్క మధు, లింగాని శ్రీనివాస్, పెండెం మనోహర్, శ్రీనివాస్ గౌడ్, సత్తయ్య గౌడ్, శివశంకర్, దాసరి శ్రీనివాస్, దేవయ్య, పొన్నాల రాజు, వడ్డెర ఎల్లయ్య, అయోధ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

**బోయిన్‌పల్లిలో...**
**కంటోన్మెంట్, డిసెంబర్ 17 ప్రభాతవార్త:** అన్నంపెట్టే రైతులపై అ క్రమ కేసులు బణాయించి అన్నదాతలను జైలు పాలు చేయడం సరైంది కాదని, బేవరేజెస్ కార్పోరేషన్ మాజీ చైర్మన్, తెలంగాణ ఉద్యమ కారుడు గజ్జెల నాగేశ్ డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మంగళవారం కంటోన్మెంట్, బోయిన్‌పల్లి మార్కెట్ వద్ద ఉన్న బాబాసాహెబ్ అంబేర్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు రావుల సతీష్, సత్యనారాయణ గౌడ్, ఏ.ఎల్.ఆనంద్, గంగారామ్, సతీష్, శేఖర్, కనకయ్య, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

## కిస్మత్‌పూర్‌లో పెన్షనర్ల భవనం ప్రారంభం



పెన్షనర్ల భవనం ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్.

**నార్సింగి, డిసెంబర్ 17 ప్రభాతవార్త :** బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలోని కిస్మత్‌పూర్‌లో రూ.90.లక్షలతో నిర్మించిన పెన్షనర్ల భవనంను మంగళవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "జాతీయ పెన్షనర్ల దినోత్సవం" రోజే పెన్షనర్ల భవనంను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. పెన్షన్ అనేది వృద్ధాప్యంలో సురక్షిత భవిష్యత్తు కోసం, స్థిరమైన ఆర్థిక ఆధారమని పేర్కొన్నారు. ఉద్యోగస్థులు జీవితాంతం కష్టపడి పోగు చేసుకొన్న డబ్బులో నుంచి తమ అవసరాల కోసం నెలనెలా కొంత డబ్బును పెన్షన్ రూపంలో తీసుకుంటారన్నారు. ప్రతీ ఒక్కరూ తమ సంపాదనలో కొంత డబ్బును వృద్ధాప్యంలో ఎదురయ్యే అనారోగ్య సమస్యలు, ఇతర అవసరాల కోసం దాచుకోవాలని సూచించారు. పెన్షనర్లంతా ఈ భవనంలో కూర్చోని ఆనందపరవశులయ్యారు. ఎన్నో ఏళ్లగా ఇలాంటి భవనం కావాలని కలలుగన్నామని, ఇప్పుడు ఆ కల నిజమైనందుకు సంతోషంగా ఉందని పెన్షనర్లు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసన మండలి చైర్మన్ స్వామిగౌడ్, బండ్లగూడ కార్పోరేషన్ మేయర్ మద్దెల లతా ప్రేమ్‌గౌడ్, మాజీ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్, కమీషనర్ శరత్‌చంద్ర, కార్పోరేటర్లు గోకరి శ్రీలత సురేష్‌గౌడ్, నిఖిల సంగారెడ్డి, బుర్ర సాగర్‌గౌడ్, అస్లాం, కో ఆప్షన్ సభ్యులు మలాకిరత్నం, నాయకులు పూలపల్లి కృష్ణారెడ్డి, సుమన్‌గౌడ్ పాల్గొన్నారు.

## దేవాదాయ ధర్మాదాయశాఖను రద్దు చేయాలి

**నాంపల్లి, డిసెంబరు 17 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దేవాదాయ ధర్మాదాయశాఖను రద్దుచేసి రాష్ట్రంలోని అన్ని దేవాలయాలకు స్వయంప్రతిపత్తి కల్పించే విధంగా తక్షణ చర్యలు తీసుకోవాలన ఆల్ ఇండియా రక్షణసేన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు మహ్మద్ సాహిద్ ఖాన్, పార్టీ జాతీయ అధ్యక్షుడు రామకృష్ణలు కోరారు. వీరు చార్మినార్ భాగ్యలక్ష్మి దేవాలయంలో కుంకుమ ధరించి అమ్మవారికి పూజలు నిర్వహించి మాట్లాడుతూ ఇతర మతాలకులేని కేవలం హిందూ దేవాలయాలకే అన్వయించడం, దేవాలయాల నుండి వచ్చే ఆదాయం ప్రభుత్వ ఖజానాకు చేర్చడం ఎవరు చెప్పిన సెక్యులరిజమని ప్రభుత్వాన్ని నిలదీశారు. ఇలాంటి చర్యల వల్ల సెక్యులరిజం వర్ధిల్లదు పైగా హిందువుల్లో అభద్రతాభావం పెరుగుతుందన్నారు. ప్రభుత్వాలు అన్యాయమైన సూడో సెక్యులరిజం చర్యలు చేస్తుంటే సమానత్వం ఎక్కడుందని ప్రశ్నించారు. దేశంలోని అందరూ భారతీయులు ఒకటేనని, అన్ని మతాలకు, కులాలకు రాజ్యాంగం ఒక్కటే.... కల్పిస్తున్న హక్కులూ ఒక్కటేనని, అందరికీ చట్టాలు, న్యాయం ఒకేవిధంగా పనిచేస్తాయనే సందేశాన్ని ఇవ్వాల్సిన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని వారు గుర్తుచేశారు. ఈ అంశాన్ని ప్రస్తుతం జరుగుతున్న శాసనసభ సమావేశాల్లోనే చర్చించి తగునిర్ణయం తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని కోరారు.

## హైదరాబాద్ నగర శివార్లలో వీధి కుక్కలపై విష ప్రయోగం

### -కుక్కల మృత్యువాతపై రాచకొండ కమిషనర్‌కు ఫిర్యాదు

### -విచారణ చేస్తున్న మీర్‌పేట్ పోలీసులు

**సరూర్‌నగర్, డిసెంబరు 17 ప్రభాతవార్త:** హైదరాబాద్ నగర శివార్లలోని మీర్‌పేట్ ప్రశాంతిహిల్స్ రోడ్ నెంబర్ 5లోనున్న శ్రీద్వారకామాయి సాయిబాబా పీఠం వీధిలో ఆశ్రయం పొందుతున్న వీధి కుక్కలకు గుర్తు తెలియని వ్యక్తులు ఆహారంలో విషం పెట్టి చంపుతున్నారని పీఠాధిపతి పూజ్యశ్రీ గోపాలకృష్ణానంద స్వామీజీ రాచకొండ పోలీస్ కమీషనర్‌కు ఫిర్యాదు చేశారు. స్థానికంగా తమ పీఠం ఉన్న వీధిలో గత కొన్ని సంవత్సరాల నుండి పలు వీధి కుక్కల ఆలనా పాలనా చూస్తూ తమ పీఠం పార్కింగ్ స్థలంలో ఆశ్రయం ఇస్తున్నామనీ వాటికి నిత్యం ఆహారాన్ని పెట్టడంతో పాటు టీకాలు కూడా వేయించడం జరిగిందని ఆయన కమీషనర్ దృష్టికి తెచ్చారు. అయితే ఇటీవల కొన్ని రోజుల్లో నాలుగు శునకాలు అనుమానాస్పద స్థితిలో చనిపోయాయనీ వాటికి పెడిగ్రీ ఆహారంలో విషం పెట్టి గుర్తు తెలియని వ్యక్తులు చంపి ఉంటారని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. స్థానికంగా ఉండే కొంత మంది కుక్కలపై విష ప్రయోగం జరిపి ఉంటారనే అనుమానాలు స్వామీజీ వ్యక్తం చేశారు. పశువైద్యులు సైతం పరీక్షించి విష ప్రయోగం వల్ల కుక్కలు చనిపోయాయని నిర్ధారించారని తెలిపినట్లు వివరించారు. ఈ విషయమైన పీఠం తరపున మల్లాది సాయికుమార్ సైతం ఫిర్యాదు చేశాడని పీఠాధిపతి తెలిపారు. ఈ మేరకు పోలీసులు విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గోపాలకృష్ణానంద స్వామీజీ కమిషనర్ కోరారు. కాగా ఫిర్యాదులపై స్పందించిన మీర్‌పేట్ పోలీసులు సంఘటనా ప్రాంతానికి వచ్చి వివరాలు సేకరించారు. ఈ మేరకు వారు విచారణ చేస్తున్నారు.

## భవనంపై నుంచి కిందపడి వాచ్‌మెన్ మృతి

**కంటోన్మెంట్, డిసెంబర్ 17 ప్రభాతవార్త:** నిర్మాణంలో ఉన్న భవనం నాలుగవ అంతస్థులో క్యూరింగ్ చేస్తున్న కార్మికుడు ప్రమాదవశాత్తు కిందపడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయిన విశాద సంఘటన బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అంజయ్యనగర్‌లో కలకలం రేపింది. పోలిసులు సీఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా బహుబూబాబాద్‌కు చెందిన యాకయ్య (55)తన భార్య సావిత్రితో నగరానికి బతుకుదెరువుక ఓసం వచ్చి బోయిన్‌పల్లిలోని అంజయ్యనగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో యాకయ్య ఇంటి సమీపంలోని షేక్ జహింగీర్‌కు చెందిన నిర్మాణంలో ఉన్న భవనంలో వాచ్‌మెన్‌గా పనికి కుదిరాడు. రోజూలాగే సోమవారం రాత్రి నిర్మాణంలో ఉన్న భవనం నాలుగవ అంతస్థులో యాకయ్య నిర్మాణానికి నీళ్లు చల్లుతున్నాడు. ప్రమాదవశాత్తు కిందపడి ఆక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. తన భర్త ఇంటికి రాలేదని అతని భార్య సావిత్రి భవనం వద్దకు వచ్చి చూసినా భర్త కనిపించలేదు. దీంతో పక్కనే ఉన్న యజమాని షేక్ జహింగీర్ వద్దకు వెళ్లి తన భర్త కనిపించడం లేదని విచారించింది. ఇంతలోనే ఓ గుర్తు తెలియని మృతదేహం చెత్తకుప్పలో పడి ఉందని అటుగా వెళ్లే వాహనదారులు 100కు డైల్ సమాచారం అందించారు. తీంతో పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. ఇంతలో స్థానికుల సమాచారంతో అక్కడి చేరుకున్న సావిత్రి తన భర్త యాకయ్య మృతదేహాన్ని గుర్తించింది. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురికి తరలించి దర్యాప్తు జరుపుతున్నారు.

## ప్రమాదవశాత్తు బిల్డింగ్‌పై నుండి పడి వ్యక్తి మృతి..

**పేట్ బషీరాబాద్, డిసెంబర్ 17, ప్రభాతవార్త**
ప్రమాదవాషత్తు బిల్డింగ్ పైన నుండి పడి ఓ వ్యక్తి చనిపోయిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మహేష్ శిందే పేట్ బషీరాబాద్‌లోని హర్ష హాస్పిటల్ వెనకాల నిర్మాణంలో ఉన్న బిల్డింగ్‌లో సోమవారం ఉదయం 6.30 గంటలకు సెంట్రింగ్ పనికి వెళ్ళాడు. కాంట్రాక్టర్ శ్రీనివాస రావు, యజమాని బాబు రావు ఆదేశాల మేరకు అయిదవ అంతస్తూలో సెంట్రిల్ పని చేస్తూ ప్రమాదవశాత్తు అదుపు తప్పి కింద పడిపోయాడు. వెంటనే మిగత పని వారు అందరూ కలిసి హర్ష హిస్పిటల్‌లో జాయిన్ చేసారు. తీవ్రంగా గాయపడిన మహేష్ శిందే చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి 7.15 గంటలకు మరణించాడు. మృతుని భార్య శిందే నమ్రత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## భార్య మృతికి కారకుడైన భర్తకు రిమాండ్

### -అత్తమామలకు నోటీసులు

**పేట్ బషీరాబాద్, డిసెంబర్ 17, ప్రభాతవార్త**
అదనపు కట్నం కోసం వేధింపులకు గురి చేసి తన భార్య మృతికి కారకుడైనా భర్తను రిమాండ్కు తరలించగా అత్తమామలకు నోటీసులు జారీ చేసిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుండ్లపోచంపల్లిలోని యుఎస్ఓ ఆర్కెడ్ అపార్ట్మెంట్ ప్లాట్ నంబర్ 113లో నివాసం ఉంటున్న పిన్న శశీకాంత్ సుమలకు గత కొన్నెండ్ల కిందట వివాహం జరిగింది. వీరికి వరుణాయి(5), చాణిక్య (15 నెలల) పిల్లలు ఉన్నారు. గత కొద్ది రోజుల నుండి సుమను తన భర్త శశీకాంతో పాటు మామ, అత్తలు నిత్యం అదనపు కట్నం కోసం వేధింపు లకు గురి చేయడంతో పలుమార్లు ఇరువురి కుటుంబ సభ్యుల మధ్య ఒప్పించారు. అయినా తీరు మారకపో వడంతో తీవ్ర మనోవేధనకు గురైన సుమ నవంబర్ 10న ఉదయం గుండ్లపోచంపల్లిలోని రైల్వేట్రాక్‌పై పడి ఆత్మహత్య చేసుకుంది. దీంతో మృతురాలి తల్లి మీనా ఈ నెల 4న పేట్ బషీరాబాద్ పోలీస్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టగా భర్త శశీకాం త్‌ను రిమాండ్కు తరలించగా వృద్ధులైనా అత్తమామలకు నోటీసులు జారీ చేసిన్నట్లు తెలిపారు.

## కాన్షిరాం ఆశయ సాధన కోసం పాటుపడాలి

**గోషామహల్, డిసెంబరు 17ప్రభాతవార్త:**
కాన్షీరాం ఆశయ సాధన కోరకు బహుజనలందరు ముందుకు రావాలని హైదరాబాద్ జిల్లా బిఎస్‌పి అధ్యక్షులు పి.వై.గిరి మహారాజ్, ఇన్‌చార్జ్ అల్లోల రమేష్‌లు అన్నారు. ఈమేరకు గోషామహల్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బిఎస్‌పి సమావే శం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దళిత బహుజనులు రాజ్యాధికారం చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అగ్రకులాల పార్టీలుకేవలం దళితులను, బహుజనులను కేవలం ఓటు బ్యాంక్‌గానే వాడుకుంటున్నట్లు తెలిపారు. దళితుల బహుజనులు విద్య, వైద్య, ఉద్యోగ రంగాలతోపాటు రాజకీ య రంగాలల్లో రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉంద న్నారు. ఈసందర్భంగా గోషామహల్ నియోజకవర్గం బిఎస్‌పి అధ్యక్షులుగా కళ్యాణ్‌నందేష్‌ను నియమించారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సోను సాల్మన్, యాకు త్‌పురా నియోజకవర్గం అధ్యక్షులు రవి కిషన్, సీనియర్ నాయకులు ఆధారిరాజేష్, రామ్‌చందర్, రాకేష్, తుంకుంట్ల జైకుమార్, శ్యామ్, కళ్యాణిగంగమ్మ, కళ్యాణి నాగేశ్వరి పాల్గొన్నారు.

## ఎంబిఎస్సీ కులాలకు 7 శాతం రిజర్వేషన్లు కేటాయించండి

**హైదరాబాద్, డిసెంబరు 17, ప్రభాతవార్త:**
దళిత ప్రయోజనాలు పొందడంలో 78 ఏళ్లగా అణిచివేతకు గురై దళితుల్లో అత్యంత వెనుకబడిన ( ఎంబిఎస్సీ)57 కులాలకు ఎస్సీ వర్గీకరణలో 7 శాతం రిజర్వేషన్స్ కల్పించి ఏవర్గంలో చేర్చాలని ఎస్సీ 57 ఎంబి ఎస్సీ కులాల హక్కుల పోరాట సమితి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు బైరి వెంకటేశం మోచి అన్నారు. ఈ మేరకు మంగళవారం బిఆర్‌కె భవన్లో ఎస్సీ వర్గీకరణ పై నియమించిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ జస్టిస్ షమిమ్ అక్తర్ ను పలువురు ఎంబిఎస్సీ కులాల నాయకులతో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ తో 57 ఎంబి ఎస్సీ కులాల స్థితి గతులపై, ఇంతకాలం ఈ కులాలకు విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ పరంగా జరిగిన అన్యాయంపై సుధీర్ఘంగా చర్చించారు. మా కులాలను మాల మాదిగ కులాలతో కలపకుండా ప్రత్యేక కేటగిరిలో ఉంచి జనాభా దమాషా ప్రకారం కాకుండా అన్ని రంగాల్లో వెనుకబాటు తనం ఆధారంగా 7 శాతం రిజర్వేషన్స్ ఇవ్వాలన్నారు. ఇప్పటివరకు కనీసం కులపత్రాలు కూడా ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, నూతన జనాభా లెక్కల ప్రకారం అన్నిరంగాల్లో వెనుకబాటు తనం ఆధారంగానే 57 కులాలకు అధికశాతం రిజర్వేషన్స్ కల్పించాలని విజ్ఞప్తి చేసారు. ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు 57 ఎంబి ఎస్సీ కులాల ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి తమ కులాలను ఆదుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా పంబాల కులవృత్తి కళాకారులు తమ జామిడిక వాయిద్యంతో, డక్కలి కళాకారులు కిన్నెర వాయిద్యం తో పాటల రూపంలో తమ సమస్యలను కమిషన్ చైర్మన్ కి వినిపించారు. వెనుకబడిన దళిత కులాలందరికి సామాజిక న్యాయం జరిగేలా చూస్తామని కమిషన్ చైర్మన్ హామీ ఇచ్చారన్నారు ఈ కార్యక్రమం లో నాయకులు కర్నె రామారావు డక్కలి, కురువ జయరాములు మదాసి కురువ, రాయిల లక్ష్మీనర్సయ్య చిందు, సనాధన్ మాంగ్ గారోడి, సుద్దాల కుమారస్వామి, బత్తుల పాండు పంబాల , సంపత్ గోసంగి, మల్లు ప్రసాద్ మాల దాసరి, బొబ్బిలి రమేష్ మాలజంగం, పర్శపాక శ్రీనివాస్ మాదిగ దాసు, కొలుపుల నవీన్ తదితరులు పాల్గొన్నారు.



కమిషన్ చైర్మన్‌కి వినతిపత్రం ఇస్తున్న బైరి వెంకటేశం, కర్నె రామారావు తదితరులు

## సమాజ శ్రేయస్సు కోసం పోరాడేది సిపిఐ : సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్

**కొంపల్లి, డిసెంబర్ 17, ప్రభాతవార్త**
కుత్బుల్లాపూర్ మండలం జగత్గిరిగుట్ట శాఖ పార్టీ సభ్యత్వం పునరుద్దరణ సందర్భంగా మంగళవారం శాఖ సభ్యులకు పార్టీ సభ్యత్వ కార్డులను ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమానికి శాఖ కార్యదర్శి సహదేవరెడ్డి అధ్యక్షత వహించగా ఉమా మహేష్ ముఖ్య అతిథిగా విచ్చేసి సభ్యత్వాలు అందచేసి మాట్లాడటం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కొరకు ప్రాణ త్యాగాలకైనా సిద్దమని చెప్పి తెల్ల దొరలు పోయి నల్ల దొరలు కాదు సంపూర్ణ స్వాతంత్రం నినాదాన్ని ఇచ్చి అందరికి సమానమైన ఫలాలు అందించాలంటే సోషలిస్టు వ్యవస్థతోనే అది సాధ్యమని నాటి నుండి నేటి వరకు అనేక త్యాగాలను చేసిన చరిత్ర సిపిఐకే ఉందని అన్నారు. అన్ని బూర్జువా పార్టీలు వారి నాయకత్వం లేక పెట్టుబడిదారుల కోసం పని చేస్తాయని కానీ కమ్యూనిస్టులు మాత్రం పేద మధ్యతరగతి ప్రజల కోసం అనుక్షణం పోరాటం చేస్తారని అన్నారు. సిపిఐ సభ్యత్వం అందరికి ఇవ్వరని దాని సిద్ధాంతం కోసం ఎర్రజండా పట్టేవారికి మాత్రమే ఇస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జానకిరామ్, ప్రజానాట్య మండలి అధ్యక్షుడు బాబు, సభ్యులు నగేష్ చారి, సోమయ్య, సామెల్, రవి, నర్సింహారెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.



## ఔట్ సోర్సింగ్ కార్మికుల కేటగిరి మార్పు చేయకుంటే ఉద్యమమే

### -వాటర్‌బోర్డు సీవరేజ్‌బోర్డు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ యూనియన్ అధ్యక్షుడు నారాయణ హెచ్చరిక

**చిక్కడపల్లి, డిసెంబరు 17 ప్రభాతవార్త:** వాటర్‌వర్క్స్ లో పనీ చేసే ఔట్ సోర్సింగ్ కార్మికుల గత బీవీ మార్చిన సందర్భంగా మిగిలిపోయిన వారందరిని కేటగిరి మార్చి జీతాలు పెంచడంతో ఇతర సమస్యలు పరిష్కరించాలని యూనియన్ అధ్యక్షుడు నారాయణ గారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. మంగళవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో హైదరాబాద్ మెట్రోవాటర్‌వర్క్స్ సీవరేజ్‌బోర్డు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల యూనియన్ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు నారాయణ మాట్లాడుతు వాటర్‌వర్క్స్ లో పని చేసే ఔట్ సోర్సింగ్ కార్మికులు చాలీ, చాలని వేతనాలైన రూ.13,500లతో నగరంలో బ్రతకడం చాలా కష్టం కనుకనే గత 2023 ఆగస్టులో జీవో 60 ద్వారా వేతనాలు పెంచిన సందర్భంగా కేటగిరి-2 లో చేర్చాల్సిన కార్మికులను కేటగిరి-1 లో చేర్చడం ద్వారా ప్రతి కార్మికునికి నెలకు రూ.4వేలు నష్టపోతున్నారని, అధికారుల తప్పిదాన్ని సరిదిద్ది కేటగిరి మార్చి జీతాలు పెంచాలని డిమాండ్ చేసారు. వెంటనే సమస్యలు పరిష్కరించకుంటే బోర్డు కార్యాలయం ముట్టడిస్థామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్, నాయకులు శ్రీనివాసరెడ్డి కుమార్ ఆంజనేయులు, రమేష్, కుమార్, వీరాస్వామి, బాల్‌రాజ్., సురేష్, ప్రవీణ్, యాదగిరి, విజయ్, రమాదేవి, తార, బాబు, అశోక్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న వాటర్‌బోర్డు సీవరేజ్‌బోర్డు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ యూనియన్ అధ్యక్షుడు నారాయణ

## గ్రంథాలయ సంస్థల పెన్షనర్లకు 010 పద్దు ద్వారా జీతాలు చెల్లించాలి

**చిక్కడపల్లి, డిసెంబరు 17 ప్రభాతవార్త:** తెలంగాణ జిల్లా గ్రంథాలయ సంస్థల పెన్షనర్ల సంఘ అధ్యక్ష ఎన్నికలు జరిగాయి. మరోసారి అధ్యక్షుడిగా కొక్కుల దేవేందర్ అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికైనారు, ప్రధాన కార్యదర్శిగా సోమశివయ్య, కోశాధికారిగా దాచెపెల్లి బుచ్చయ్య గారు ఎన్నికైనారు. మంగళవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో జరిగిన సమావేశంలో ఎన్నిక ప్రక్రయను నిర్వహించారు. ఈ సందర్భంగా కొక్కుల దేవేందర్ మాట్లాడుతూ తెలంగాణ జిల్లా గ్రంథాలయ సంస్థల ఉద్యోగుల, పెన్షనర్ల చిరకాల డిమాండ్ 010 పద్దు ద్వారా జీతాలు, పెన్షన్స్ ట్రెజరి నుండి ప్రభుత్వం నుండి చెల్లించాలి. 310/311 పద్దు క్రింద సాలరీ గ్రాంట్ ప్రభ్వుత్వమే 1975 నుండి చెల్లించడానికి ట్రెజరీ నుండి జీతాలు, పెన్షన్స్ చెల్లించాలని గత బిఆర్ఎస్ ప్రభుత్వానికి ఎన్నో వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందని, గత ప్రభుత్వము కుంటి సాకులు చెప్పి తప్పించుకోవడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. నూతనంగా ఏర్పాటైన తెలంగాణ రాష్ట్రం, ఇచ్చిన పార్టీ అయిన కాంగ్రెస్, ప్రస్తుత ప్రజాప్రభుత్వం పాలన వచ్చినందున, ఇదే అంశంపై సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్కతో పాటు మంత్రులకు, సలహాదారులకు, అధికారులకు సాలరీ గ్రాంట్ ద్వారా జీతాలు, పెన్షన్స్ ప్రభుత్వము చెల్లించు చున్న దానిని 010 పద్దు ద్వారా జీతాలు, పెన్షన్స్ చెల్లించాలని పలుమార్లు వినతిపత్రాలను ఇవ్వడం జరిగిందన్నారు. కాగా ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి విద్యాశాఖ కార్యదర్శికి ఆదేశాలు వస్తున్నాయని, దీనిపై చర్యలు తీసుకోడం లేదు, ఆర్థిక భారము లేని డిమాండ్లను పరిశీలిస్తామని సిఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపినందున, సంబంధిత అధికారులు సిఎం దృష్టికి ఇప్పటికైనా తీసుకవెళ్ళడంతో పాటు సిఎంను కలిసేందుకు వీలుగా అపాయింట్మెంట్ ఇస్తే తమ సమస్యలను వెల్లడించడంతో పాటు ఆర్థిక భారము లేనందున వివరంగా తెలుపుతామన్నారు. ఎన్నికల అధికారిగా తుమ్మ సత్య నారాయణ వ్యవహరించారు. కాగా తెలంగాణ జిల్లా గ్రంథాలయ సంస్థల పెన్షనర్ల సంఘము సహ కార్యదర్శిగా ఆడం షఫీలను ఎన్నుకున్నారు. కాగా , కార్యవర్గ సభ్యులను త్వరలో ప్రకటిస్తామని ఎన్నికల అధికారి తుమ్మ సత్యనారాయణ తెలిపినారు.



ప్రసంగిస్తున్న తెలంగాణ జిల్లా గ్రంథాలయ సంస్థల పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు కొక్కుల దేవేందర్

# పంచాయతీ కార్మికుల ముందస్తు అరెస్టు


పావన్నపేటలో కార్మికుల అరెస్టు


అల్లాదుర్గంలో కార్మికుల అరెస్టు



హుస్నాబాద్‌లో కార్మికుల అరెస్టు


టేక్మాల్‌లో కార్మికుల అరెస్టు

**పావన్నపేటలో...**

**పావన్నపేట, డిసెంబరు 17, ప్రభాతవార్త:** హైద్రాబాద్ ఇందిరా పార్క్ వద్ద నిర్వహిస్తున్న ధర్నాకు తరలి వెళుతున్న పంచాయతీ కార్మికులను మంగళవారం పోలీసులు ముందస్తుగా అరెస్టుచేసి పోలీసుతాణాకు తరలించారు. ఈసందర్భంగా పంచాయతీ కార్మికసంఘం నాయకులు సామేల్ మాట్లాడుతూ పంచాయతీ కార్మికులను రెగ్యూలరైజ్ చేయాలని డిమాండ్‌చేశారు. కేటగిరీలవారీగా వేతనాలు పెంచాలని డిమాండ్‌చేశారు. స్వంత పూచీకత్తుపై కార్మికులను విడుదల చేశారు.

**అల్లాదుర్గంలో...**

**అల్లాదుర్గం, డిసెంబరు 17, ప్రభాతవార్త:** న్యాయమైన డిమాండ్ల సాధనకై చలో హైద్రాబాద్ వెళుతున్న పంచాయతీ కార్మికులను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీసుతాణాకు తరలించారు. ఈసందర్భంగా పంచాయతీకార్మికులు మాట్లాడుతూ గత కొన్నిమాసాలుగా వేతనాలు అందక కుటుంబసభ్యులం అర్థాకలితో అలమటిస్తున్నామని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రభుత్వం స్పందించి బకాయి ఉన్న వేతనాలను బకాయి వేతనాలు వెంటనే అందించకుంటే భారీ ఎత్తున రాస్తారోకో నిర్వహించి విధులను బహిష్కరిస్తామని హెచ్చరించారు.

**హుస్నాబాద్‌లో...**

**హుస్నాబాద్ రూరల్, అక్కన్నపేట, డిసెంబరు 17, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా గ్రామపంచాయతీలలో పంచాయతీ కార్మికులుగా విధులు నిర్వహిస్తున్న కార్మికులకు కనీసవేతనం, హెల్త్‌కార్డులు, ప్రమాదబీమా కల్పించాలనే డిమాండ్‌తో పంచాయతీ కార్మికసంఘం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మంగళవారం అసెంబ్లీ ఎదుట ఏర్పాటుచేసిన నిరసన కార్యక్రమానికి వెళ్లకుండా హుస్నాబాద్, అక్కన్నపేట మండలాలలో కార్మికులను పోలీసులు మంగళవారం ఉదయం ముందస్తుగా అరెస్టుచేసి పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు. అయితే కార్మికులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా గ్రామ పంచాయతీలలో కార్మికులుగా వెట్టిచాకిరి చేస్తున్నా ప్రభుత్వాలు తమను గుర్తించడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా కనీసవేతనంతో పాటు ప్రమాదబీమా, హెల్త్ కార్డులు మంజూరుచేసి ఆదుకోవాలని డిమాండ్‌చేశారు. అరెస్ట్ అయినవారిలో పాక సురేష్, బత్తుల శ్రీనివాస్, పిట్టల కిరణ్, బొద్దున సతీష్, మేడబోయిన వినోద్, గద్దల కనుకయ్య, బత్తుల రాజయ్యలు ఉన్నారు.

**టేక్మాల్‌లో...**

**టేక్మాల్, డిసెంబరు 17, ప్రభాతవార్త:** కార్మికుల సమస్యలను పరిష్కరించుకునేందుకు గాను తలపెట్టిన ఆందోళన కార్యక్రమాలకు వెళ్లకుండా టేక్మాల్ మండలంలోని ఆయా గ్రామపంచాయతీలకు చెందిన కార్మికులను మంగళవారం టేక్మాల్ పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. అసెంబ్లీ ముట్టడికి యత్నిస్తున్న కార్మికులను పోలీసులు అరెస్ట్‌చేశారు. కార్మికులు మాట్లాడుతూ.. కార్మికులకు పనికి తగినవేతనాలు చెల్లించాలని, పెండింగ్ లో ఉన్న మూడునెలల వేతనాలను పెంచి చెల్లించాలని వారు డిమాండ్‌చేశారు. ఇందులో కార్మికసంఘాల నాయ కులు కార్యదర్శులు తదితరులున్నారు.

## అయ్యప్పస్వామి ఆభరణాల ఊరేగింపు


జోగిపేటలో అయ్యప్ప స్వామి ఆభరణాలను ఊరేగిస్తున్న దృశ్యం

**జోగిపేట, డిసెంబరు 17, ప్రభాతవార్త:** అయ్యప్పస్వామి ఆభరణాల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. జోగిపేటలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయం నుంచి హౌసింగ్ బోర్డులోని అయ్యప్పస్వామి మందిరం వరకు అయ్యప్పస్వామి ఆభరణాల ఊరేగింపును మంగళవారం ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప మాలధారణ చేసిన స్వాముల ఆధ్వర్యంలో ఈ ఆభరణాల ఊరేగింపు కొనసాగింది. బాజాభజంత్రీలు, మేళతాళాలు, అయ్యప్పస్వామి భక్తిపాటల మధ్య స్వాముల నృత్యాల నడుమ వైభవంగా ఆభరణాల ఊరేగింపు సాగింది. ఆభరణాల ఊరేగింపును తిలకించేందుకు దారి పొడుగునా భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేశారు. అయ్యప్పస్వామి ఆభరణాల ఊరేగింపు నేత్రపర్వంగా సాగింది. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కొరబోయిన నాగరాజు, గురుస్వాములు పులుగు గోపాల్‌రావు, దేవరశెట్టి సంతోష్, మహేష్ యాదవ్, అందోలుకు చెందిన ఎలగోరి సత్యం, కన్నెస్వాములు, కత్తిస్వాములు, గంటస్వాములు పాల్గొన్నారు.

## అధ్యక్షుని ప్రమాణ స్వీకారానికి కదిలిన పద్మశాలీలు


ప్రమాణ స్వీకారానికి తరలిన పద్మశాలీలు

**కోహెడ, డిసెంబరు 17, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం నూతన అధ్యక్షునిగా వల్లకాటి రాజ్‌కుమార్ ప్రమాణస్వీకారం సికింద్రాబాద్‌లోని హరిహరకళాభవన్‌లో మంగళవారం ఏర్పాటుచేయగా ఈ కార్యక్రమానికి పద్మశాలిసంఘం సభ్యులు, కులస్థులు కోహెడ మండలంలోని సముద్రాలగ్రామం నుండి పెద్ద ఎత్తున తరలివెళ్లారు. వెళ్లినవారిలో సంఘం అధ్యక్షులు గోరిట్యాల లక్ష్మణ్, కార్యదర్శి పాము సతయ్య, జిల్లా ఈసి మెంబర్ అజకృష్ణ, మండల కమిటీసభ్యులు వడ్డెపల్లి బాలయ్య, కొక్కుల రమేష్, యూత్ అధ్యక్షులు దోవిందు వెంకటేశం, ప్రధాన కార్యదర్శి వేముల వీరభద్రంతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్‌ఫాం సాగుతో అధిక లాభాలు


రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

**అక్కన్నపేట, డిసెంబరు 17, ప్రభాతవార్త:** ఆయిల్‌ఫాం సాగుతో రైతులు అధికలాభాలు పొందవచ్చని హార్టికల్చర్ ఆఫీసర్ బాలాజీ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని రైతువేదికలో ఆయిల్‌ఫాం సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆయిల్‌ఫాం సాగుకు ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ వివరాలను రైతులకు వివరించారు. అయితే ఈ ఆయిల్‌ఫాం పంటవేసిన రైతులు మూడు సంవత్సరాల వరకు మధ్యలో ఇతరపంటలు కూడా సాగు చేసుకోవచ్చన్నారు. నాలుగుసంవత్సరాల నుండి ఈ ఆయిల్‌ఫాం దిగుబడి అవుతుందన్నారు. ఒక్కసారి ఆయిల్‌ఫాం సాగుచేస్తే 30ఏళ్ళు దిగుబడి వస్తుందన్నారు. ఈపంటకు రోగాల బెడద తక్కువ అని మార్కెటింగ్ సమస్యలు కూడా లేవన్నారు. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి తస్లీమా సుల్తానా, ఏఈవో విజయ్‌కుమార్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## నాయీ బ్రాహ్మణ సేవాసంఘం కార్యవర్గం

**కంది, డిసెంబరు 17, ప్రభాతవార్త:** మండల నాయీబ్రాహ్మణ సేవా సంఘం మండల నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షులు మామిళ్ల నాగభూషణం, డివిజన్ అధ్యక్షులు చర్యాల ఆంజనేయులు, జిల్లా ప్రధానకార్యదర్శి రాజారాం, వర్కింగ్ ప్రెసిడెంట్ శివకాంతం, ఉపాధ్యక్షులు దత్తాత్రేయ మురళి వీరన్న, సత్తయ్యల ఆధ్వర్యంలో మండలకమిటీని ఎన్నుకున్నారు. కమిటీ గౌరవ అధ్యక్షులుగా రామచంద్రయ్య, అధ్యక్షులుగా శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా చేర్యాల నరసింహులు, ప్రధానకార్యదర్శిగా వెంకట్, ఉపకార్యదర్శిగా శ్రీనివాస్, కోశాధికారిగా రాజేందర్, ఉపకోశాధికారిగా కుమార్, కమిటీ సభ్యులుగా గోపాల్, ఎట్టయ్య, రాజు, కృష్ణ, మల్లేశం, మురళి, రాజులను ఎన్నుకున్నారు.

## శ్రీఅభయ ఆంజనేయస్వామి వార్షికోత్సవం


రాములవారి కళ్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

**రామాయంపేట, డిసెంబరు 17, ప్రభాతవార్త:** రామాయంపేట పట్టణంలోని బాలాజీ ఫంక్షన్‌హాల్ ఎదురుగా ఉన్న శ్రీఅభయ ఆంజనేయస్వామి దేవాలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు చాలా ఘనంగా జరిగాయి. ఈ నెల 16వ తేది నుండి వార్షికోత్సవ వేడుకలు ప్రారంభం కాగా 18వ తేదీ బుధవారం నాటితో వేడుకలు ముగుస్తాయి. ఈకార్యక్రమంలో మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, టిఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు గజవాడ నాగరాజు, రామాయంపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటరాజాగౌడ్, మున్సిపల్ కౌన్సిలర్‌లు దేమే యాదగిరి, సుందర్‌సింగ్, మండల వ్యవసాయ శాఖ అధికారి రాజ్‌నారాయణ, టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పల్లె రామచంద్రగౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు చౌదరి సుప్రభాతరావు, రావిపల్లి అమరసేనారెడ్డి, చింతల స్వామి, ఎనిశెట్టి అశోక్ గుప్తా, తదితరులు పాల్గొన్నారు. కాగా 18వ తేదీన మహా పూర్ణాహుతితో ఉత్సవం పరిసమాప్తి జరుగుతుందని గురుస్వామి బక్కన్నగారి లాలాగౌడ్ తెలిపారు. ప్రతిరోజు హనుమాన్ సేవాసమితి భక్తబృందం చేస్తున్న భజనలు ఆకట్టుకుంటున్నాయి.

## యాప్ ద్వారా లబ్దిదారుల గుర్తింపు


ఇందిరమ్మ కమిటీ ద్వారా లబ్దిదారులను నమోదుచేస్తున్న దృశ్యం

**పుల్‌కల్, డిసెంబరు 17, ప్రభాతవార్త:** మొబైల్ యాప్ ద్వారా ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల గుర్తింపు కార్యక్రమం ఆరంభం అయింది. నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం విదితమే. ఇందులో భాగంగా ప్రజాపాలనలో ధరఖాస్తు చేసుకున్నవారి వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదుచేస్తున్నారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ధరఖాస్తుదారుల వివరాలను నమోదుచేసే పనిలో మునిగి పోయారు. నియోజకవర్గానికి 3500 గృహాలు కేటాయిస్తున్నందున గ్రామానికి 25 నుంచి 30మందికి ఇందిరమ్మ ఇళ్లు వచ్చే అవకాశాలు ఉన్నాయి. డిసెంబరు నెలాఖరు వరకు ధరఖాస్తుల పరిశీలన పూర్తిచేయాలని కార్యదర్శులపై అధికారులు ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో కార్యదర్శులను ఆదేశించినట్లు ప్రచారం సాగుతోంది. సొంతస్థలం ఉన్న దళితులు, గిరిజనులు, పేదవ్యవసాయ కూలీలు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, పారిశుధ్య కార్మికులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి (అర్హత ఉన్న వారికే) ఇందిరమ్మ ఇల్లు మంజూరుచేసే అవకాశాలు ఉన్నాయి. గ్రామాల్లో నియమించిన ఇందిరమ్మ కమిటీలది ప్రధానపాత్ర కానుంది.

## పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి


సీనియర్ పెన్షనర్ ప్రభాకర్ రాజును సన్మానిస్తున్న దృశ్యం

**రామాయంపేట, డిసెంబరు 17, ప్రభాతవార్త:** మంగళవారం ఉద్యోగుల పెన్షనర్స్ డే సందర్భంగా రామాయంపేట పట్టణంలో రిటైర్డ్ ఉద్యోగులు సమావేశమై సమస్యలను చర్చించారు. ఈసమావేశానికి నారాయణ అధ్యక్షత వహించగా సీనియర్ పెన్షనర్ ఎర్రబట్టు ప్రభాకర్‌రాజును సభ్యులందరు కలసి సన్మానించారు. ఈసందర్భంగా వారి సాధకబాధకాలను చర్చించారు. జిల్లా పిఆర్టియు మాజీ అధ్యక్షులు శ్రీనివాస్ హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పి.బాలనర్సయ్య, ఎస్.లక్ష్మయ్య, జిల్లా బాధ్యులు బి.నాగేశ్వర్‌రావు, టి.రాములు, కె.నారాయణ, నింబాద్రి, డి.భూపాల్, సుధాకర్‌రాజు, కె.శ్రీనివాస్, ఎం.సిద్ధిరాములు, ఎం.ఫణికర్ పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులపై కార్పొరేటర్ రివ్యూ సమావేశం


అభివృద్ధి పనులపై సమీక్షాసమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్ పుష్పనగేష్

**రామచంద్రాపురం, డిసెంబరు 17, ప్రభాతవార్త:**

రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ కాలనీ వార్డ్ కార్యాలయంలో కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షాసమావేశం మంగళవారం నిర్వహించారు.

జిహెచ్‌ఎంసి ఇంజనీరింగ్ ఏఈ ప్రభు, విద్యుత్ ఏఈ తిరుపతమ్మలు పాల్గొన్న సమావేశాన్ని ఉద్దేశించి కార్పొరేటర్ పుష్పనగేష్ మాట్లాడుతూ త్వరలో ప్రారంభంకానున్న బస్సురూట్ రోడ్ వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. బాలవిహార్ పార్క్‌లో అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయని, సివిల్ పనులు త్వరితగతిన పూర్తిచేస్తే హార్టికల్చర్‌శాఖతో 30లక్షల రూపాయలతో గ్రీనరీపనులు ప్రారంభిస్తామన్నారు. హిందూ స్మశాన వాటికలో అసంపూర్తిగా ఉన్న షెడ్ బర్నింగ్ ప్లాట్‌ఫార్మ్, బోరు తదితర పనులకు ప్రతిపాదనలుచేస్తే నిధులమంజూరుకు కృషిచేస్తానన్నారు.

కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శామ్యూల్ వినయ్‌కుమార్, మైనార్టి అధ్యక్షులు మహమ్మద్ హబీబ్, ఐలేష్ ఐలాపూర్, కావలి నగేష్, కావలి శ్రీరాములు, ఎల్వర్తి మల్లేష్, సుంకు స్వామి, శ్రీకాంత్, రాగం యాదయ్య, రమేష్, హన్మంతు, శ్రీను, బైకాన్ నవీన్ యాదవ్, ఈర్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు ఠాణాను పరిశీలించిన డిఎస్‌పి


హద్నూర్ ఠాణాలో పోలీసులకు సూచనలు చేస్తున్న డిఎస్‌పి రామ్మోహన్‌రెడ్డి

**న్యాల్‌కల్, డిసెంబరు 17, ప్రభాతవార్త:**

మండలంలోని హద్నూర్ పోలీసు ఠాణాను మంగళవారం డిఎస్‌పి రామ్మోహన్‌రెడ్డి తనిఖీ చేశారు. ఠాణాకు చేరుకున్న డిఎస్‌పి స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. ఠాణాకు ఇటీవల కొత్తగా బాధ్యతలు స్వీకరించిన పోలీసు సిబ్బందికి డిఎస్‌పి పలు సూచనలు చేశారు. పోలీసు సిబ్బంది విధి నిర్వాహణ తీరును సిఐ జక్కుల హనుమంతు, ఎస్ఐ చల్లా రాజశేఖర్‌లను డిఎస్‌పి అడిగితెలుసుకున్నారు.

## నేత్రపర్వంగా సీతారాముల కళ్యాణోత్సవం


సీతారాముల కళ్యాణోత్సవంలో కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి

**రామచంద్రాపురం, డిసెంబరు 17, ప్రభాతవార్త:** భేల్ ఎంఐజి కాలనీలోని శ్రీరామాలయంలో మార్గశిరమాసం, పునర్వసు నక్షత్రంను పురస్కరించుకుని మంగళవారం సీతారాముల కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా కొనసాగింది. కళ్యాణోత్సవకార్యక్రమానికి భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి దంపతులు హాజరై సీతారాముల కళ్యాణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉదయం ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న భక్తులు ఆలయ అర్చకులు వేదమంత్రాలు వల్లిస్తుండగా స్వామివారిని దర్శించుకుని పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలోని కళ్యాణ మండపంలో వేదపండితుల వేదమంత్రోచ్ఛరణల మధ్య కళ్యాణం కమనీయంగా కొనసాగింది. ఈసందర్భంగా కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతిమాసం ఆలయంలో పునర్వసు నక్షత్రం పర్వదినాన శ్రీసీతారాముల కళ్యాణోత్సవాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆలయానికి చేరుకున్న భక్తులు ప్రసాదవితరణ (అన్నదానం) నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు భీమ్‌రెడ్డి, కమిటీ సభ్యులు శ్రీనివాస్, సత్యనారాయణ, హనుంజయ, టివి రావు, సంపత్‌గౌడ్, రాకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సండే మార్కెట్ వద్ద బస్తీదర్శన్


సండే మార్కెట్ వద్ద బస్తీదర్శన్‌లో పాల్గొన్న కార్పొరేటర్ పుష్పనగేష్

**రామచంద్రాపుం, డిసెంబరు 17, ప్రభాతవార్త:** రామచంద్రాపురం డివిజన్ శ్రీనివాస్‌నగర్‌కాలనీ సండేమార్కెట్ వద్ద మంగళవారం నిర్వహించిన బస్తీదర్శన్‌లో జిహెచ్‌ఎంసి అధికారులతో కలిసి కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ పాల్గొని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బస్సురోడ్ సుందరీకరణ ప్రక్రియలో భాగంగా విస్తరణ చేస్తున్న స్థలాన్ని కార్పొరేటర్ పరిశీలించారు. 10మీటర్ల రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న విద్యుత్‌స్తంభాలను తొలగించేందుకు గతంలో ప్రతిపాదనలు చేసి నిధులు మంజూరు అయినందున త్వరగా ప్రారంభించి 10మీటర్ల అవతల పోల్స్ తిరిగి పెట్టాలని కార్పొరేటర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌నాయకులు శామ్యూల్ వినయ్‌కుమార్, మైనార్టి అధ్యక్షులు మహమ్మద్ హబీబ్, ఐలేష్ ఐలాపూర్, కావలి నగేష్, కావలి శ్రీరాములు, ఎల్వర్తి మల్లేష్, సుంకు స్వామి, శ్రీకాంత్, రాగం యాదయ్య, రమేష్, హన్మంతు, శ్రీను, బైకాన్ నవీన్ యాదవ్, ఈర్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సవాలకు ముస్తాబైన హజ్రత్ మౌలానా దర్గా


ముస్తాబైన హజ్రత్ మౌలానా మొయిజుద్దీన్ తుర్కి రహేమతుల్లా దర్గా

**జహీరాబాద్ (కోహీర్), డిసెంబరు 17, ప్రభాతవార్త:** నియోజకవర్గంలోని మండల కేంద్రమైన కోహీర్ పట్టణంలోని హజరత్ మౌలానా మొయిజుద్దీన్ తుర్కీ రహేమతుల్లా 766వ ఉర్సు ఉత్సవాలు ఈ నెల 18వ తేదీ నుంచి ప్రారంభం అవుతాయని దర్గా కమిటీ అధ్యక్షులు మొహమ్మద్ షౌకత్ అలీ తెలిపారు. 18న సర్కారీ గంధంతో ఉర్సు ఉత్సవాలు ప్రారంభం అవుతాయన్నారు. 19న హిరామన్ సందల్ ఉంటుందన్నారు. మధ్యాహ్నం 3గంటలకు కుస్తీపోటీలు నిర్వహిస్తామన్నారు. కుస్తీపోటీల్లో జాతీయస్థాయి మల్లయోధులు పాల్గొంటారన్నారు. 19,20వ తేదీలలో జాతీయస్థాయి ఖవ్వాలి పోటీలు ఉంటాయన్నారు.

# రైతులపై దాడులకు నిరసన



జహీరాబాద్‌లో బిఆర్‌ఎస్ నాయకుల నిరసన


హుస్నాబాద్‌లో బిఆర్‌ఎస్ నాయకుల నిరసన


సిద్ధిపేటలో బిఆర్‌ఎస్ నాయకుల నిరసన

**జహీరాబాద్‌లో...**

**జహీరాబాద్, డిసెంబరు 17, ప్రభాతవార్త:** లగచర్ల రైతులను కాపాడాలంటూ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి బిఆర్‌ఎస్ నాయకులు మంగళవారం వినతిపత్రం అందచేశారు. మాజీ మంత్రులు తన్నీరుహరీష్‌రావు, కల్వకుంట్ల తారకరామారావు, ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావుల ఆదేశాల మేరకు బిఆర్‌ఎస్ నేతలు అంబేద్కర్‌విగ్రహానికి వినతిపత్రం అందించి తమనిరసనను వ్యక్తంచేశారు. ఈసందర్భంగా జహీరాబాద్, ఝరాసంగం, మొగుడంపల్లి మండలాల బిఆర్‌ఎస్ అధ్యక్షులు తట్టు నారాయణ, వెంకటేశం, సంజీవ్‌రెడ్డిలు మాట్లాడుతూ న్యాల్‌కల్ మండలంలోని వడ్డి, డప్పూర్, మల్గి గ్రామాల్లోని 2003ఎకరాల భూములను ఫార్మా కంపెనీ ఏర్పాటు కొరకు ప్రభుత్వం తీసుకునే కుట్రలు చేస్తోందని ఆందోళన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయ కులు బండి మోహన్, యాకూబ్, నర్సింహారెడ్డి, మోహన్‌రెడ్డి, అమిత్ కుమార్, ప్రభు పాటిల్, చిన్నరెడ్డి, ప్రవీణ్‌పాటిల్, సర్వేజ్, హీరు రాథోడ్, గోపాల్, సంజు పవార్, రాథోడ్ భీమ్‌రావు నాయక్, గులాబ్ సింగ్, చందు యాదవ్, కిషన్, పుండ్లిక్ పవార్, దర్శు నాయక్, బిక్కు రాథోడ్, చందర్ తదితరులు పాల్గొన్నారు.

**హుస్నాబాద్‌లో...**

**హుస్నాబాద్ టౌన్, డిసెంబరు 17, ప్రభాతవార్త:** కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ఫార్మసిటీ పేరిట గిరిజనరైతుల వద్ద బలవంతంగా భూములు లాక్కోవడానికి చేసే ప్రయత్నంలో రైతులపై ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని బిఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు తుల ఉమ డిమాండ్‌చేశారు. మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో పార్టీనాయకులతో కలసి ప్రభుత్వం తీరుపై నిరసన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు అన్వర్ పాషా, పార్టీ నియోజకవర్గ అధికారప్రతినిధి అయిలేని మల్లిఖార్జునరెడ్డి, మాజీ ఎంపిపి ఆకుల వెంకట్, కౌన్సిలర్లు బొజ్జ హరీష్, బొల్లి కల్పన శ్రీనివాస్‌లు ఉన్నారు.

**సిద్ధిపేటలో...**

**సిద్ధిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** ఫార్మాసిటీ పేరుతో లగచర్లలో గిరిజనరైతుల భూములు తీసుకోవడానికి, సిఎం రైతులను జైలులోపెట్టి థర్డ్ డిగ్రీ ఉపయోగించడంతో పాటు జైలులో రైతుకు గుండెపోటు వస్తే బేడీలువేసి తీసుకుపోవడం సిగ్గుచేటని సుడా మాజీచైర్మన్ మారెడ్డి రవీందర్ రెడ్డి, బిఆర్‌ఎస్ నాయకులు వంగి నాగిరెడ్డి, రాధాకృష్ణశర్మలు అన్నారు. కార్యక్రమంలో పార్టీ ప్రజాప్రతినిధులు, పట్టణ బిఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు కొండం సంపత్‌రెడ్డి నియోజకవర్గ నాయకులు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.